# “ ”

## హితశ్రీ

(శీర్షికగా ఉటంకింపు గుర్తులు మాత్రమే ఉండటం చూసి పాఠకులు ముద్రారాక్షస మనుకునేరు! అది అంతే!)

ఆరోతరగతివాళ్ల వ్యాసరచన పోటీలో వచ్చిన రచనలు దిద్దటం ఎలాగో పూర్తి చేసి వాటిని ప్రధానోపాధ్యాయుడికి సమర్పిద్దామని హైస్కూలికి వెళ్లాను. ఆయన తీరిగ్గా పేపరు చదువుకుంటున్నాడు. నన్ను చూసి పేపర్ని బల్ల మీద పారేసి కుతూహలంగా అడిగాడు.

“అప్పుడే పేపర్లన్నీ వాల్యూ చేసేశారేమిటి? ఎలా రాశారు మనవాళ్ళు?”

“ఫరవాలేదండి. నేననుకున్నదాని కంటె బాగానే రాశారు”

“అన్నింటికంటె ఉత్తమమైన రచన తీసి చదవండి కాస్త. మన కుర్రాళ్ళు ఏ ప్రమాణంలో ఉన్నారో చూస్తాను.”

నేను ఆ కాగితాల కట్టవిప్పి ఓ పేపరు ఏరి ఆయనకి చూపించాను. అది చూసి ఆయన మొదట తెల్లబోయి తరువాత చిరునవ్వు నవ్వి అన్నాడు:

“తెల్ల కాగితం ఇచ్చిన వాళ్ళుకూడా ఉన్నారన్నమాట. మీరు ఫస్టుమార్కు ఇచ్చిన పేపరు తియ్యండి, చూద్దాం.”

“ఫస్టుమార్కు ఆ పేపరుదేనండి.”

ప్రధానోపాధ్యాయుడు నావైపు ఆశ్చర్యంగా చూసి కాస్త విచారం సూచించే కంఠంతో అన్నాడు:

“మనవాళ్లు ఇంత వెనకబడ్డారనుకోలేదు నేను.”

“వెనకపడకపోగా, గొప్ప తెలివితేటలు ప్రదర్శించారని నా నమ్మకం.”

“ఎలా?” సాశ్చర్యంగా అడిగాడాయన.

“తెల్ల కాగితం ఇవ్వటంలోనే గొప్పభావం ఉంది.”

“ఏదో చెత్త రాయటంకంటే, కాగితం చెడగొట్టకుండా తెలివి చూపించారంటారా?”

“అదికాదు. తెల్ల కాగితం ఇచ్చిన కుర్రాడు ఇతడొక్కడే. అతను ప్రశ్నని బాగా అర్థం చేసుకుని జవాబు ఇవ్వటంలో గొప్ప నేర్పుని ప్రదర్శించాడు. కొన్నికొన్ని భావాలని వ్యక్తపరచటానికి మనుష్య భాషలో పదాలు దొరకవని మీరు ఒప్పుకుంటారనుకుంటాను.”

“మీరేదో తమాషాగా మాట్లాడుతున్నారు. ఈ విషయం మీరు చాలా తేలికగా చూస్తున్నట్టున్నారు. కాని నాకు చాలా తలవంపులుగా ఉంది. వ్యాస రచనలో మన విద్యార్థులింత అసమర్థులని.”

“క్షమించాలి. మీరు నేను చెప్పింది సరిగా అర్థం చేసుకోలేదు. త్రిలోకసుందరి కథ వినలేదా మీరు?”

“త్రిలోకసుందరి కథేమిటి? మీవంతా విడ్డూరంగా ఉంది.” నేను ఓసారి గొంతు సవరించుకుని ఇలా ప్రారంభించాను:

“ఆకథా క్రమంబెట్టిదనన సకలైశ్వర్యములకు బుట్టినిల్లయిన భరత ఖండమున దొల్లి.”

“మాట్లాడే భాషలో క్లుప్తంగా చెప్పవయ్యా మహానుభావా.” ప్రధానోపాధ్యాయుడు నవ్వి అన్నాడు.

“పూర్వం త్రిలోకసుందరి అనే రాజకుమారి ఉండేదిట. ఆవిడ కొన్ని ప్రశ్నలిచ్చి వాటికి జవాబులు సరిగా ఇచ్చినవాడిని పెళ్లిచేసుకుంటానందిట. ఓ రాజకుమారుడు అన్ని ప్రశ్నలకీ జవాబులు రాసిపంపి చివరి ప్రశ్న దగ్గర మాత్రం ఆలోచనలో పడ్డాడు. “వధూవరుల ప్రథమ సమాగమంలో ఒండొరుల భావాలు ఎలా ఉంటాయి?” అనేది ఆఖరి ప్రశ్న. దీనికతను ఆలోచించి, చివరికి తెల్లకాగితం పంపాట్ట. జవాబుగా ఆ అమ్మాయి అతనికి శుభలేఖ పంపించిందిట, విన్నారా?”

ప్రధానోపాధ్యాయుడు నవ్వి అన్నాడు.

“వివరణ కూడా చెప్పండి మరి.”

"వధూవరుల ప్రథమ సమావేశంనాటి వారి భావాలు ప్రపంచంలో పుట్టి పెరిగిన భాషలన్నిటికీ అతీతాలు అన్నమాట. ఆ భావాలు అనుభవించి తెలుసుకోవాలిసిందేగాని మాటల్లో చెప్పాలంటే వ్యర్థప్రయత్నమే అవుతుంది. ఎంత చెప్పినా ఏదో చెప్పనట్టే ఉంటుంది. అంచేత తెల్లకాగితం ఇవ్వటం కంటె తెలివిగల పని మరోటి లేదా సందర్భంలో."

"ఆ పనే మనవాడూ చేశాడంటారా?" ఆయన పగలబడి నవ్వుతూ అన్నాడు. "ఇంతకీ మీరు ఇచ్చిన ప్రశ్నేమిటి వాళ్ళకి?"

"సామాన్య మానవుడికి మన ప్రభుత్వం చేసిన మేలుని గురించి రాయమన్నాను."

ప్రధానోపాధ్యాయుడు నవ్వు తకీమని ఆపేసి ముఖం కొంచెం గంభీరంగా పెట్టాడు. నేను బలవంతాన నవ్వాపుకున్నాను.

"సామాన్య మానవుడికి మన ప్రభుత్వం చేసిన మేలుని గురించి రాయటానికి ప్రపంచంలో మరో కొత్తభాష పుట్టుకురావాలని ఈ కుర్రవాడి అభిప్రాయమయి ఉంటుందని ఊహించి ఇతనికి భావాన్ని వ్యక్తీకరించటంలో గల అసామాన్య ప్రతిభకి మెచ్చి ఫస్టుమార్కు ఇచ్చాను."

"మీ వ్యాఖ్యానం విపరీతంగా ఉంది. సరే. అన్నిటింటే తక్కువ మార్కులు వచ్చిన పేపరు తియ్యండి, దాంట్లో ఏం వింతలున్నాయో, చూద్దాం."

ఆ కాగితాల కట్టలోంచి ఇంకో పేపరు తీసి ప్రధానోపాధ్యాయుడి కోరిక ప్రకారం ఇలా చదివాను:

"ప్రభుత్వమనగా మంత్రుల కూటమి. ప్రభుత్వమువారేపని చేసినను చిట్టచివరకు దాని ఫలితము అనుభవించువాడు సామాన్యమానవుడే నని గ్రహింపవలెను. ప్రభుత్వము అనగా మంత్రులు చేసిన మంచిపనులు రెండు విధములు—(1) ప్రత్యక్షముగా చేసినవి (2) పరోక్షముగా చేసినవి.

మంత్రులు ప్రత్యక్షముగా చేసిన మంచిపనులు:

పగలంతయుం కష్టించి పనిచేసిన సామాన్య మానవులకు వినోదమునకు మిక్కిలి అవశ్యకములైన సినిమా థియేటర్లు పెక్కింటికి ప్రారంభోత్సవములు, శంకుస్థాపనోత్సవములు జరిపిరి.

స్వరాజ్యము వచ్చుటకు కారణభూతులైన మహానాయకులను మరిచిపోయి సామాన్య మానవులు కృతఘ్నులు కాకుండుటకు నాయకుల శిలాప్రతిమలను పెక్కింటిని స్థాపించి వాటిని స్వయముగ ఆవిష్కరించిరి.

గొప్ప ఓపికతో రైళ్లలో ప్రయాణముచేసి కేంద్రప్రభుత్వాదాయము వృద్ధి పొందుటవలన సామాన్య మానవులకు జరుగు మేలు ఇతోధికముగా జరుగుటకు అవకాశ మేర్పడుచున్నది.

ఈమధ్య ఆంధ్రదేశమునకు తుపాను, వరదల ప్రమాదము సంభవించినపుడు వాటివల్ల కలిగిన ప్రాణ, ధననష్టము అత్యల్పమనియు, పత్రికలలో ప్రకటింపబడిన వార్తలు కేవలము అతిశయోక్తులనియు ప్రకటించి ప్రజలకు (ప్రజలలో ఎక్కువమంది సామాన్య మానవులేనని మరువరాదు) భయము దీర్చిరి.

ఆశ్రితులకు ఆశ్రయమిచ్చిరి.

ప్రతి మునిసిపాలిటీగల పట్టణమును సందర్శించి, వీధులకు రెండువైపులా సమాంతరముగా ప్రవహించు జీవనదులవల్ల కలిగెడి అనర్థములను తొలగించగలవారమని వీధి మనుషులకు హామీల నిచ్చిరి.

పరోక్షముగా చేసినవి:

రహదారి బంగళాలకు వెల్ల వేయించిరి.

ముఖ్య రహదారులను మరమ్మతు చేయించిరి.

చదవటం ముగించి ప్రధానోపాధ్యాయుడివైపు చూశాను. ఆయన నావైపు చురచుర చూసి అన్నాడు: "చూస్తే మీరు కళ్లు మూసుకుని పేపర్లు వాల్యూ చేసినట్టున్నారు. ఇతనికి నూటికి నూరు మార్కులు ఇవ్వండి. ఎంత చక్కగా, విపులంగా రాశాడు!"

నా మాట యింత సులభంగా తోసేసినందుకు ఆయనమీద నాకు మహాచెడ్డకోపం వచ్చింది. కోపంలో అన్నాను.

"కళ్లు తెరుచుకుని వాల్యూ చేయబట్టే ఇతనికి మార్కులు ఎక్కువ వేయలేకపోయాను. మీరు వెయ్యమంటే నాదేంపోయింది? అలాగే వేస్తాను. కాని కళ్లు తెరుచుకొని మాత్రం ఆపని చేయలేను." అని కళ్లుమూసుకుని ఆ పేపరుమీద నూరు అంకెవేసి కళ్లుతెరిచాను. ఎదురుగా గోడ గడియారం నా వంక ఉరిమిచూసింది.